క్లుప్తంగా

గ్రంథాలయాధికారిగా బాబ్జి



గ్రంథాలయాధికారులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

జమ్మలమడుగు రూరల్ : ప్రభుత్వ గ్రంథాలయాధికారిగా నాదేండ్ల బాబ్జి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న జింక చంద్రశేఖర్ కమలాపురంకు బదిలీ అయ్యారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బండారు శ్రీనివాసులు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గడియారం సాహితీ పీఠం అధ్యక్షుడు డాక్టర్ ఎంఎల్ నారాయణరెడ్డి హాజరై మాట్లాడారు. కమిటీ సభ్యులు ఇరువురిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోండి

కొండాపురం : బక్రీద్ పండుగను శాంతి యుతంగా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీ ముస్లిం సోదరులకు సూచించారు. మంగళవారం కొండాపురం సర్కిల్ కార్యాలయ ఆవరణలో ముస్లిం మత పెద్దలు శాంతి కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా బక్రీద్ పండుగను నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో కొండాపురం ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి, ముస్లిం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే నిత్యావసర సరుకుల పంపిణీ

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని గ్రామాల్లో నివాసముంటున్న వృద్ధులకు, వికలాంగులకు 65 ఏళ్లు పైబడిన అనారోగ్యంతో మంచానికి పరిమితమైన కార్డుదారులకు ప్రతినెలా 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు కార్డులకు సంబంధించిన నిత్యావసర సరుకులను ఇంటి వద్దకే వచ్చి పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ నజీర్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నిత్యావసర సరుకులను 65 ఏళ్లు పైబడిన వారందరికీ డీలర్లు మీ ఇంటి వద్దకే వచ్చి సరుకులు అందజేస్తారన్నారు. వికలాంగులెవరూ రేషన్ షాపుల వద్దకు రావాల్సిన అవసరం లేదన్నారు.

వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ

వేంపల్లె : రాష్ట్ర ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యాన్ని వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దనే పంపిణీ చేస్తారని తహసీల్దార్ హరినాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక శ్రీరాంనగర్‌లోని కాలేజ్ రోడ్డులో ఉన్న 8వ డీలర్ షాపు ద్వారా నడవలేని వృద్ధులకు, వికలాంగులకు ఇంటి వద్దకే వెళ్లి డీలర్ ఏలిశమ్మ ద్వారా తహసీల్దార్ రేషన్ బియ్యాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ లోకేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల ప్రిన్సిపాల్‌గా నాగేంద్ర



ప్రిన్సిపాల్ నాగేంద్రను అభినందిస్తున్న రిటైర్డు ప్రిన్సిపాల్ యోగాంజనేయులు

వేంపల్లె : స్థానిక ప్రభుత్వ వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నాగేంద్రను నియమిస్తూ హయ్యర్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ నారాయణ భరత్ గుప్తా ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయనను కళాశాల అధ్యాపకులు, రిటైర్డు ప్రిన్సిపాల్ యోగాంజనేయులు సత్కరించి కళాశాలను మరింత అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో పీడీ తేజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీని విజయవంతం చేద్దాం

పులివెందుల టౌన్ : వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి నేతృత్వంలో బుధవారం జరిగే వెన్నుపోటు దినం కార్యక్రమ ర్యాలీని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు రామ్‌లక్ష్మణ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక పులివెందులలో ఆయన వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగాల నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్, 133 హామీలతో ప్రజాగళం ఉమ్మడి మ్యానిఫెస్టో 2024 ఎన్నికలలో చూపెట్టి అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. ప్రజలను మోసం చేస్తున్న వైనాన్ని ఎండగడుతూ బుధవారం పులివెందులలో జరిగే వెన్నుపోటు దినం ర్యాలీలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగ జిల్లా కోశాధికారి రాఘవేంద్రారెడ్డి, యువజన కార్యకర్తలు తేజ, రాకేష్, మల్లి, జగన్, హరి, పవన్, గణేష్, దాదావల్లి తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో ఏపుగా పెరిగిన పత్తి పంట

- దిగుబడులపై రైతులలో చిగురించిన ఆశలు
- ధరలు స్థిరంగా ఉంటే సాగులో ఆదాయం



ఏపుగా పెరిగిన పత్తి పంట

వేముల : ఈ ఏడాది వేసవి పత్తి సాగుకు వర్షాలు సకాలంలో పడటంతో పత్తి పంట ఏపుగా పెరిగింది. ఈ ఏడాది పత్తి పంటను మార్చి నెల నుంచే రైతులు సాగు చేసుకున్నారు. సాగు సమయంలో అధిక ఉష్ణోగ్రత్తలు ఉన్నప్పటికి రైతులు సాగుకు మొగ్గు చూపారు. మార్చి నెలలో పత్తి సాగు చేసిన మొదలు ఏప్రిల్ చివరి వరకు ఆశించిన మేర వర్షాలు లేవు. ఆడపా దడపా కురిసిన వర్షాలు పంటకు సరిపోలేదు. అరకొర వర్షాలకు తోడు రైతులు సకాలంలో నీటితడులు అందించారు. వేసవిలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో నాలుగైదు రోజులకు నీటి తడులు ఇవ్వడం ద్వారా పంటను కాపాడుకున్నారు. ముందుగా సాగు చేయడం ద్వారా దిగుబడులు ముందుగానే వస్తాయని ధరలు, ఆదాయం ఉంటుందనే ఆశతో రైతులు ముందుగానే సాగు చేసుకున్నారు.

వర్షాలతో గట్టెక్కిన వేసవి పత్తి సాగు

ఈ ఏడాది వేసవి పత్తి సాగుపై రైతులలో ఉన్న ఆందోళనకు వర్షాలు ఆశలు నింపాయి. సాగు సమయంలో ఉన్న ఎండలతో పత్తి పంట గిటకబారిపోయేది. అయితే సాగుకు ప్రకృతి అనుకూలించడంతో రైతుల ఆశలకు వర్షాలు ఆవిరిపోశాయి. ఏప్రిల్ నెలలో అరకొర వర్షాలు, మేనెలలో పదును వర్షాలు పత్తి పంటకు ఊరటనిస్తున్నాయి. తుపాన్ ప్రభావం, నైరుతి రుతుపవనాల ప్రభావంతో పదును వర్షాలతో పత్తి పంట ఏపుగా పెరిగింది. ప్రస్తుతం పంట పూత, పిందె, కాయ దశలో ఉంది. అంతేకాక అప్పుడప్పుడు వర్షాలు పడటంతో తెగుళ్లు కూడా పెద్దగా ఆశించలేదు.

పంటను ముందు జాగ్రత్తగా సస్యరక్షణ చర్యలు

వేసవి పత్తి పంటకు తెగుళ్లు సోకకుండా రైతులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నారు. సకాలంలో నీటి తడులు ఇవ్వడం, కూలీలతో కలుపు తీసివేయడం, సకాలంలో మందులు పిచికారి చేయడం ద్వారా పంట ఆశాజనకంగా కనిపిస్తోంది. పంటకు ఇప్పటికే రైతులు రెండు, మూడు సార్లు మందు స్ప్రే చేశారు.



పూత, పిందె, కాయదశలో ఉన్న పత్తి పంట

అలాగే పంటలో కలుపు లేకుండా జాగ్రత్త పడ్డారు. ముఖ్యంగా పత్తి పంటకు రసాయనిక ఎరువులను విత్తడం ద్వారా బాగా కనిపిస్తోంది. ఇప్పటికే పత్తి సాగు చేసి 70రోజులు కావస్తోంది. మరో నెల రోజుల్లో పత్తిలో దిగుబడులు చేతికి అందనున్నాయి.

ధరలు స్థిరంగా ఉంటే ఆదాయమే.. :

వేసవి పత్తి సాగులో రైతులలో ఆదాయం ఉంటుంది. అయితే మార్కెట్ ధరలు స్థిరంగా ఉండాలి. పత్తి దిగుబడులు, కొనుగోళ్లు ప్రారంభం నుంచే ధరలు స్థిరంగా ఉండాలి. అలా కాకుండా మార్కెట్ ధరలు హెచ్చుతగ్గులు ఉంటే రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది. గత ఏడాది క్వింటా పత్తి రూ.7300ల నుంచి రూ.8200ల వరకు ధరలు పలికాయి. అనంతరం ధరలు తగ్గడంతో ధరల కోసం చూసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది కూడా క్వింటా పత్తి రూ.8వేలకు తగ్గకుండా ఉంటే పత్తి సాగులో ఆదాయం ఉంటుందని రైతులు అంటున్నారు.

పత్తి సాగుపై ఆశలు పెట్టుకున్నాం



ఈ ఏడాది పత్తి సాగుపై ఆశలు పెట్టుకున్నాం. నాకున్న 8 ఎకరాలలో పత్తి సాగు చేశా. సాగు చేసి రెండు నెలలు కావస్తోంది. పంట పూత, పిందె, కాయ దశలో ఉంది. మరో నెల రోజులలో దిగుబడులు అందుతాయి. అప్పటిలోగా మార్కెట్ ధరలు ఉన్నట్లయితే ఆదాయం ఉంటుంది.

– చంద్రమోహన్‌రెడ్డి, రైతు, గొందిపల్లె

సాగులో వేలకు వేలు పెట్టుబడులు



వేసవి పత్తి సాగులో వేలకు వేలు పెట్టుబడులు అవుతున్నాయి. విత్తనాలు, ఎరువులు, ధరలు పెరిగాయి. కూలీలకు కూలీ పెరిగింది. సాగులో అదనపు ఖర్చులు అవుతున్నాయి. తెగుళ్ల నివారణకు సకాలంలో మందులు పిచికారి చేస్తున్నాం. సాగులో దిగుబడులు పెరిగి ధరలు ఉంటే ఆదాయమే.

– రాఘవరెడ్డి, రైతు, గొందిపల్లె

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పట్టణంలోని కోతి సమాధి ప్రాంతంలో బుధవారం సాయంత్రం 3 గంటల నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. పట్టణంలోని కోతి సమాధి 33/11 కె.వి. విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సబ్ స్టేషన్ మెయింటెన్స్ ఉన్న సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించి సహరించాలని ఆయన కోరారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ



కూలీలతో యోగా చేయిస్తున్న ఎంపీడీఓ

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురం సమీపంలోని నిడివెల్ల వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం ఎంపీడీఓ కృష్ణమూర్తి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ పనుల వద్ద కూలీలకు సౌకర్యాలు, కూలీ సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీ రోజుకు రూ.307లు తగ్గకుండా కూలీ అందేటట్లు చూడాలన్నారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో యోగా చేయించారు. యోగాతో ఆరోగ్య సమస్యలు దూరమవుతాయన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ జియాబుల్, తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాలను ఎండగడదాం

- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఎండగడదామని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన భాకరాపురంలోని తన స్వగృహం వద్ద మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసిందన్నారు. ఎన్నికలప్పుడు ప్రజలకు అనేక హామీలను, వాగ్దానాలను ఇచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను పూర్తిగా తుంగలో తొక్కారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాదివుతున్నా ఇప్పటివరకు రైతన్నలకు రైతు భరోసా కానీ, విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంటు కానీ, మహిళలకు ఇస్తామన్న రూ.18 వేలు కానీ, ఉచిత బస్సు ప్రయాణం కానీ, అమ్మఒడి కానీ అనేక హామీలను అమలు చేయడంలేదన్నారు. అధికారంలోకి వస్తే సంపద సృష్టించి హామీలన్ని నెరవేరస్తానని చంద్రబాబు నాయుడు ఎన్నికలప్పుడు ప్రతి మీటింగ్‌లోనూ ఊదరగొట్టడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాలు అమలు చేయాలంటే రాష్ట్ర ఖజానా ఖాళీగా ఉందని ఒట్టి చేతులు చూపుతున్నారన్నారు. చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన తర్వాత సంవత్సర కాలంలోనే 1.60 లక్షల కోట్లు అప్పులు చేయడం జరిగిందన్నారు. అంతేకాక రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆరాచకాలకు గతంలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన అనేక కంపెనీలు తిరిగి వెళ్లడం జరిగిందన్నారు. అనంతరం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు పరామర్శ :

గతనెల 26వ తేదీన తెలుగుదేశం పార్టీ జెండాలను తొలగించారని సాకుగా చూపి పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌తోపాటు మరికొంతమందిపైన అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్ల మేరకు పులివెందుల పోలీసులు అటెంట్ మర్డర్ కేసు నమోదు చేసి వారిని రిమాండ్‌కు పంపిన విషయం విదితమే. బుధవారం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ లీగల్ అడ్వజయిర్ ఓబుళరెడ్డితో కలిసి పులివెందుల సబ్ జైలులో రిమాండ్‌లో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులను ములాఖత్ ద్వారా కలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని వారికి భరోసా ఇచ్చినట్లు తెలిసింది.

‘వెన్నుపోటు దినం’ విజయవంతం చేద్దాం

- పట్టణంలో భారీ ర్యాలీ
- ఆర్డీఓకు వినతిపత్రం అందించనున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పులివెందుల : పులివెందుల వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో «వెన్నుపోటు» దినం నిర్వహించనున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంవత్సరం పూరైన సందర్భంగా ప్రస్తుత ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుండటంతో మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా «వెన్నుపోటు» దినం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం పులివెందుల పట్టణంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డిల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టనున్నారు. ఈ ర్యాలీ పట్టణంలోని స్థానిక పాత ఎమ్మెల్యే ఆఫీస్ నుంచి మొదలై పాత ఆర్టీసీ బస్టాండు నుంచి స్థానిక ఆర్డీఓ కార్యాలయం వరకు కొనసాగనుంది. అనంతరం ఆర్డీఓకు వైఎస్సార్‌సీపీ నేతలు వినతిపత్రం సమర్పించనున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలి రానున్నారు.

కమలాపురంలో..

కమలాపురం : ప్రజలకు హామీలిచ్చి వాటిని గాలి కొదిలేసిన చంద్రబాబు చేసిన మోసాలు, అరాచకాలు, అన్యాయాలపై బుధవారం నిర్వహించనున్న వెన్నుపోటు దినంను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ మండల, పట్టణ కన్వీనర్లు ఉత్తమారెడ్డి, గంగాధర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత ఏడాది జూన్ 4 తేదీన చంద్రబాబు సీఎంగా గద్దెనెక్కారని, అయితే ఏడాది కాలం గడిచిన పింఛన్ల పెంపు తప్పా ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. సూపర్ సిక్స్ పేరుతో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర హామీలిచ్చి వాటిని పూర్తి స్థాయిలో విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా కష్టకాలంలో సైతం జగనన్న ఒక్క సంక్షేమ పథకం కూడా ఆపలేదన్నారు. వెన్నుపోటు పొడవడం చంద్రబాబు నైజం అని, అసలు వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని వారన్నారు. చంద్రబాబు చేసిన మోసాలకు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టు నిరసన కార్యక్రమమే వెన్నపోటు దినం అన్నారు. కమలాపురంలో ఉదయం 9.30 గంటలకు ఖాజీపేట రోడ్డులో ఉన్న ఫయాజ్ ఫిల్లింగ్ స్టేషన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నియోజకవర్గ స్థాయిలో నిరసన ర్యాలీ చేస్తున్నామని, ఈ ర్యాలీకు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నరేన్ రామాంజులరెడ్డి హాజరు కానున్నారని వారన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పూర్తిగా విఫలమైంది. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలనే ఆలోచన కూటమి ప్రభుత్వానికి ఎక్కడ కనిపించడంలేదని దీనికి వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం వెన్నుపోటు దినంగా భావించి చేపట్టే కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లక్షుమయ్య పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మ్యానిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి ఇచ్చిన హామీలను అధికారం వచ్చిన మొదటి నెలనుంచే ప్రారంభించారు. కాని ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా ఇంత వరకు ఒక్క పథకం కూడా అమలు చేయలేకపోయిందన్నారు. వలంటీర్ వ్యవస్థ ఎందుకు పనికిరాదని చెప్పిన టీడీపీ నాయకులు ఎన్నికల సమయంలో వలంటీర్లకు నెలకు రూ.10 వేలు ఇస్తామని ప్రకటించి ప్రస్తుతం ఆ వ్యవస్థనే నిర్వీర్యం చేశారని విమర్శించారు. తల్లికి వందనం, యువగళంలో నిరుద్యోగులకు నెలకు మూడువేల రూపాయల నిరుద్యోగ భృతి అన్నారు. ఆడబిడ్డ పథకం కింద 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికి నెలకు రూ.1500 రూపాయల వారి ఖాతాలలో జమ చేస్తామని చెప్పి ఇంత వరకు అమలు చేయలేదన్నారు. ఎన్నికల సమయంలో మోసపూరితమైన వాగ్దానాలు ఇచ్చి అధికారంలోనికి వచ్చిన తర్వాత వాటిని తుంగలో తొక్కారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకం అమలు చేసే వరక ప్రజల తరపున వైఎస్సార్‌సీపీ పోరాటం చేయడం జరుగుతుందని అందులో భాగంగా బుధవారం జరుగబోయే వెన్నపోటు దినంలో బీసీలందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

కొండాపురంలో..

కొండాపురం : ఎర్రగుంట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు జరగబోయే «వెన్నపోటు దినం» నిరసన కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నవజ్యోత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అసమర్ధ పాలనను వ్యతిరేకిస్తూ బుధవారం ఉదయం ఎర్రగుంట్లలో ఉదయం 9 గంటలకు నిరసన ర్యాలీ ఉంటుందన్నారు.

గ్రామాల్లో ఘర్షణలకు తావివ్వొద్దు



మాట్లాడుతున్న ఆర్‌కే వ్యాలీ సీఐ ఉలసయ్య

వేముల : గ్రామాల్లో ఘర్షణలకు, ఎలాంటి సంఘటనలకు తావివ్వొద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దని ఆర్‌కే వ్యాలీ సీఐ ఉలసయ్య, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌లు తెలిపారు. మండలంలోని నారేపల్లె గ్రామంలో మంగళవారం రాత్రి కళాజాత జాగృతి మేలుకొలుపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఫ్యాక్షన్ నిర్మూలన, సైబర్ క్రైం, డిజిటల్ అరెస్టు, సామాజిక మాధ్యమాల నేరాలతోపాటు ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల గురించి మేలు కొలుపు ద్వారా ప్రజలకు వివరించామన్నారు. యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడవద్దన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి



వేరుశనగ విత్తనాన్ని రైతులకు అందజేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు

వీరపునాయునిపల్లె : వేరుశనగ పంట సాగుచేసే ప్రతి రైతు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం మండలంలోని ఎస్.పాలగిరి రైతు సేవా కేంద్రంలో పంపిణీ చేస్తున్న విత్తన పంపిణీ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. కిలో విత్తనానికి ఒక గ్రాము టెబ్యుకొనజోల్ లేదా 3 గ్రాములు మ్యాంకోజెబ్, ట్రైకొడెర్మావిరిడి పొడి మందుతో విత్తనశుద్ధి చేయాలన్నారు. కాండము కుళ్లు, వైరస్ తెగులు, వేరు పురుగు ఆశించే ప్రాంతాల్లో కిలో విత్తనానికి 2 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్, 600 ఎఫ్.ఎస్. 4 మి.లీ. నీళ్ల మిశ్రమంతో విత్తనశుద్ధి చేయాలన్నారు. కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి మాట్లాడుతూ వేరుశనగ పంట సాగు చేసిన వెంటనే లేదా 1–2రోజుల లోపు ఎకరానికి 1 లీటరు పెండిమిథాలిన్ 30 శాతం ద్రావకం లేదా బ్యుటాక్లోర్ 50 శాతం ద్రావకం లేదా అలాక్లోర్ 50 శాతం ద్రావకంలో ఏదో ఒక దానిని 200 లీటర్ల నీటిలో కలిపి నేలపై పిచికారి చేయాలన్నారు. మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం వేరుశనగ పంట సాగుకు వాతావరణం అనుకూలంగా ఉందని సకాలంలో విత్తనాలు, ఎరువులు అందించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శ్యామ్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

తూకాలు తక్కువ ఉండకూడదు



పంపిణీ చేసిన డీబీటీ మిషన్లతో ఏవో, డీలర్లు

జమ్మలమడుగు : రేషన్‌డీలర్ లబ్ధిదారులకు ఇచ్చే బియ్యంలో ఎటువంటి అవకతవకలు ఉండకూడదని ఆర్డీఓ సాయిశ్రీ తెలిపారు. మంగళవారం పట్టణంలోని 9,10వ వార్డుల్లో ఉన్న రేషన్ దుకాణాలను ఆకస్మిత తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి బియ్యం, చెక్కెర, జొన్నలు ఇవ్వడం జరుగుతుంది. రేషన్ డీలర్లు కొలతల్లో ఎమైన అవకతవకలకు పాల్పడితే తమకు ఫిర్యాదు చేయవచ్చు అని సూచించారు. అంతేకాకుండా వృద్ధులకు, వికలాంగులకు డీలర్లు ఇంటి వద్దకే తీసుకువెళ్లి రేషన్‌ను ఇవ్వాలని సూచించారు. ప్రజలనుంచి ఏమైనా ఫిర్యాదులు తమకు వస్తే వెంటనే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఒకటో తేదీ నుంచి 15 రోజుల పాటు రేషన్ పంపిణీ జరగాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులరెడ్డి, ఆర్‌ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా డీబీటీ మిషన్‌ల పంపిణీ



పంపిణీ చేసిన డీబీటీ మిషన్లతో ఏవో, డీలర్లు

ముద్దనూరు : ఎరువుల వ్యాపారం చేసే డీలర్లకు ఉచితంగా డీబీటీ మిషన్లను మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి సోమవారం పంపిణీ చేశారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ సౌజన్యంతో డీలర్లకు మోబి ఓషియన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన స్మార్ట్ పీఓఎస్ డీబీటీ మిషన్లను ఉచితంగా అందించిందన్నారు. ప్రతి ఎరువుల వ్యాపారం చేసే డీలరు ఈ మిషన్ ద్వారానే ఎరువుల వ్యాపారులు వారు అమ్మిన ప్రతి బస్తాను నమోదు చేయాలని, ఈ మిషన్ ద్వారానే స్టాక్ వివరాలు, గోడౌన్‌లో వున్న నిల్వ ఇవరాలు నమోదు చేస్తారని సూచించారు. ఈ మిషన్ వినియోగించే, పనిచేసే విధానాన్ని కోరమాండల్ కంపెనీ ప్రతినిధి గోవర్ధన్‌రెడ్డి వ్యాపారులకు వివరించారు. కార్యక్రమంలో డీలర్లు, కంపెనీ ఉద్యోగి రామేశ్వరరెడ్డిలు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ కుంభాభిషేకం

వేంపల్లె : స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో మంగళవారం ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో ఆలయ గోపురంపై సంప్రోక్షణ సహిత కుంభాభిషేకం ఘనంగా నిర్వహించారు. అలాగే ఆలయంలో ఆవాహిత ప్రధాన కలశ పునఃఆరాధనలు, తిరుప్పావై పఠనం, దన్వంతరి మహావిష్ణు హోమాలు, మహాపూర్ణాహుతి, ప్రధాన కలశ విసర్జన, మహాకుంభ ప్రోక్షణ, పవిత్ర విసర్జన, చతుర్వేద ఇతిహాస పురాణ ఉపనిషత్ దివ్య ప్రబంధ పఠనాలు, మహా మంగళ హారతి, వేద మహాదాశీర్వచనం తదితర విశేష పూజలు నిర్వహించారు. వెంకటేశ్వర స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయంలో విద్యార్థులు చేసిన భరతనాట్యం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామివారిని గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వేణుగోపాల్, అర్చకులు అచ్యుత నారాయణాచార్యుల నేతృత్వంలో ఒంటిమిట్టకు చెందిన అర్చకులు వీణా మనోజ్ కుమార్, మోహనాచార్యులు, ప్రశాంత్, సత్యనారాయణాచార్యులు, శ్రీనివాస్ రాఘవన్, గురుచరణ్‌లు పాల్గొన్నారు.

మలేరియా లేని సమాజం నిర్మించుకుందాం



ర్యాలీ నిర్వహిస్తున్న అర్బన్‌హెల్త్ సెంటర్ అధికారులు

జమ్మలమడుగు : మలేరియా లేని సమాజం నిర్మించుకుందామని మలేరియాసబ్ యూనిట్ అధికారి నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం మలేరియా నిర్మూళన దినోత్సవంలో భాగంగా మండల పరిధిలోని మోరగుడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లలో ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా ప్రాణాంతక వ్యాధి నివారించటానికి అందరం కలిసికట్టుగా పని చేద్దామన్నారు. ప్రజలు ఇంటి వద్ద శుభ్రత పాటించడంతోపాటు మురికినీరు నిల్వ లేకుండా చేసుకోవాలని అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ తాహిరా, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లెలో

వేంపల్లె : దోమకాటు వలన మలేరియా వ్యాధి వస్తుందని, ప్రతి ఒక్కరూ దోమ కాటుకు గురికాకుండా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వ వైద్యులు పృధ్వీకుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మలేరియా వారోత్సవాల సందర్భంగా మండలంలోని తాళ్లపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేను ఏర్పాటు చేసుకోవాలన్నారు. దోమ తెరలు తప్పనిసరిగా వాడాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు ఇంటిలో పనికిరాని చెత్తను ఉంచరాదన్నారు. కార్యక్రమంలో వైద్యులు నిహారిక, శాంతి, సీహెచ్‌ఓ వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీఉన్నీసా, ఎంపీహెచ్‌ఈఓ ఫకృద్దీన్, సూపర్ వైజర్ వెంకటలక్ష్మి, అరుణదేవి, అంకయ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మూలనపడ్డ 104 వాహనాలు



పాత ప్రభుత్వాసుపత్రి ఆవరణలో నిరుపయోగంగా ఉన్న104 వాహనం

పులివెందుల రూరల్ : గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలు అందించడానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 104 వాహనాలను ఏర్పాటు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 104 వాహనాలను మూలనపడేశారు. దీంతో అవి ఎందుకు పని రాకుండా పోతున్నాయి. పట్టణంలోని పాత ప్రభుత్వాసుపత్రిలో 104 వాహనాలను ఇలా మూలన పడేశారు. దీంతో వీటి చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగిపోయి అల్లుకుపోయాయి. అలాగే ప్రభుత్వాసుపత్రి నుంచి వివిధ ప్రాంతాలకు రోగులను, ప్రమాదాల్లో గాయాలైన వారిని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఉచితంగా యురేనియం ప్రాజెక్టు కంపెనీ వారు అంబులెన్స్‌ను ఆసుపత్రికి ఇవ్వడం జరిగింది. అయితే సంబంధిత అధికారులు ఈ అంబులెన్స్ ఉన్నా ఉపయోగించకుండా మూలన పడేశారు. దాతలు ఇచ్చిన వాటిని కూడా ప్రభుత్వాసుపత్రి అధికారులు సద్వినియోగం చేసుకోకుండా ఇలా మూలన పడేయడంతో సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత వైద్యశాఖ అధికారులు స్పందించి యురేనియం ప్రాజెక్టు సంస్థ ఇచ్చిన అంబులెన్స్‌ను వినియోగంలోకి తీసుకొస్తే పేదవారికి ఉపయోగపడుతుందని ప్రజలు అంటున్నారు.



ఉపయోగంలో లేని అంబులెన్స్